ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.0
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
3
శుక్రవారం 17 అక్టోబరు 2025



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.30 (309.9534)	53,805	53,805
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.40 (4.30)	3613.17	2995.44
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.423 (43.3532)	51,540	37,671

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220



కాంగ్రెస్ పార్టీ జిల్లా (డీసీసీ) కమిటీలకు పూర్వ వైభవం తీసుకురావాలని అధిష్ఠానం యోచిస్తోంది. ఇందులో భాగంగా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఔత్సాహికులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే గతంలో పనిచేసిన వారికి ఛాన్స్ ఇచ్చే అవకాశం లేదని కొత్త నిబంధన తెచ్చారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

రెండోసారి

- 'డీసీసీ'కి కొత్త నిబంధన
- ఐదేళ్లపాటు నిరంతరాయంగా, పార్టీలో క్రమశిక్షణతో పనిచేసిన వారే అర్హులు
- నిబంధనలు జారీచేసిన ఏఐసీసీ
- ప్రజాప్రతినిధుల బంధువులు, ప్రస్తుత డీసీసీలకు రెండోసారి పదవికి నో ఛాన్స్

ఇక నుంచి డీసీసీ అధ్యక్ష పదవి రెండోసారి వరించడం కష్టమే. గతంలో మాదిరిగా పార్టీలోని సీనియర్ నేతల సిఫారసులను పక్కనబెట్టి, పార్టీ శ్రేణులు, నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లే నేతలనే ఎంపిక చేయాలని నిర్ణయించారు. దీంతో డీసీసీ పదవిని ఆశిస్తున్న పలువురు నేతల్లో కలవరం మొదలైంది. డీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన వారు, ప్రస్తుతం కొనసాగుతోన్న వారికి రెండోసారి అవకాశం ఇవ్వవద్దని అధిష్ఠానం నుంచి ప్రకటన జారీ అయింది. డీసీసీ పదవిని చేపట్టే నేతలకు ఏఐసీసీ అధిష్ఠానం కొన్ని అర్హతలు, నిబంధనలు ప్రకటించింది. జిల్లాల్లో ప్రజాప్రతినిధుల బంధువులు, ఇప్పటివరకు డీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన వారికి మళ్లీ అవకాశం ఇవ్వకూడదని, కనీసం ఐదేళ్లపాటు నిరంతరాయంగా పార్టీలో క్రమశిక్షణతో పనిచేసిన వారు అర్హులుగా నిర్ణయించింది. ఈ నిబంధనల ప్రకారమే ఎంపిక జరగాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఉండటంతో పార్టీలోని సీనియర్ నేతలతోపాటు ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది. మరోవైపు డీసీసీ అధ్యక్షులు రానున్న రోజుల్లో పార్టీపరంగా అన్ని ఎన్నికల్లోనూ అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ నేపథ్యంలో డీసీసీ పదవి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధానంగా జిల్లాలోని అన్ని వర్గాలను కలుపుకుని, తనకంటూ ప్రత్యేక కేడర్ ఉండి, ప్రధానంగా ఆర్థికంగా నేతల పరిస్థితిని కూడా పరిగణిలోకి తీసుకునే అవకాశం ఉంది. అయితే ఎన్నికల సమయంలో పార్టీల్లో సీనియర్ నేతలు అయినప్పటికీ, తమకు అనుకూలంగా అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడంతో అటుఇటుగా మారుతుంటారు. అధిష్ఠానం నిబంధనలతో పార్టీలో సీనియర్ అయినప్పటికీ, పార్టీ మారినందుకు ఈ పదవికి అర్హత కోల్పోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఏఐసీసీ నిబంధనలమేరకు ఐదేళ్లపాటు పార్టీలో కొనసాగుతూ, ఈ బాధ్యతను సమర్థంగా ఎవరు నిర్వహిస్తారన్న అంశం స్థానిక నేతల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏఐసీసీ నిబంధనలు కఠినంగా ఉండటంతో, ఈ పదవికి తాము ఎంపికవడం కష్టమేనని పలువురు నేతలు చర్చించుకుంటున్నారు. ఏఐసీసీ కొత్త నిబంధనల ప్రకారం జిల్లాలో ఎవరెవర్ని ఈ పదవి వరిస్తుందో వేచి చూడాల్సిందే.

అధిష్ఠానానికి టచ్‌లో డీసీసీ...

కాంగ్రెస్ పునర్ వైభవం దిశగా అధిష్ఠానం సన్నాహాలు చేస్తోంది. దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయి నుంచి పార్టీని ప్రక్షాళన చేసి, ముఖ్యంగా పార్టీ కమిటీలను బలోపేతం చేసేందుకు సన్నద్ధమవుతోంది. మూడునెలల్లోగా జిల్లా కమిటీలను బలోపేతం చేసేందుకు భావిస్తోంది. డీసీసీ అధ్యక్షులు ఇకనుంచి నేరుగా డీసీసీ పెద్దలకు..

- మిగతా 6వ పేజీలో...

డీసీసీలే కీలకం

దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యంగా డీసీసీలను బలోపేతం చేసి, జిల్లా అధ్యక్షులకు విస్తృత అధికారాలు, బాధ్యతలు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తుంది. గతంలో పార్టీలోని డీసీసీలు కీలకపాత్ర వహించేది. జిల్లా అధ్యక్షులు తర్వాతి కాలంలో క్రమంగా ప్రాముఖ్యం కోల్పోయారు. వారికి పూర్వ వైభవం కల్పించాలని అగ్ర నేతలు భావిస్తున్నారు. పీసీసీలు, డీసీసీలకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. పార్టీకి సంబంధించిన అనేక అంశాల్లో నూ డీసీసీలకు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అధికారం ఇవ్వాలని, జాతీయ స్థాయిలో తీసుకునే ప్రతీ నిర్ణయం జిల్లా అధ్యక్షుల సలహాలు, సంప్రదింపుల ద్వారా తీసుకోవాలని భావిస్తున్నా రు. నిత్యం ప్రజల్లో ఉండే జిల్లా నేతలకే జనం నాడి తెలుస్తుందని, క్షేత్రస్థాయిలో వారి నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ద్వారా జాతీయస్థాయిలో కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు సన్నాహాలు చేస్తుంది. డీసీసీలను ఎంపిక చేసి, వెంటనే జిల్లా కమిటీలను పటిష్ఠం చేయాలని అధిష్ఠానం యోచిస్తోంది.

రైతు వేదికలకు నిధులేవీ?

- నిర్వహణ భారం.. రైతు సేవలకు దూరం
- రైతు వేదికలకు నిధులు రాక ఏఈవోల అవస్థలు



భువనగిరి మండలం రాయిగిరి క్లస్టర్ ముత్తిరెడ్డిగూడెం రైతు వేదిక

జిల్లాలో రైతు వేదికల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో)లు సొంత నిధులతో వాటిని నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల ద్వారా రైతులకు సాగులో మెళకువలు, ఆధునిక పద్ధతులను చేరువ చేయాలనే లక్ష్యం నీరు గారుతోంది.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి రూరల్)

గత ప్రభుత్వం ప్రతి వ్యవసాయ క్లస్టర్‌కు ఓ రైతు వేదికను నిర్మించింది. ఆ తర్వాత ఒక్కో దాన్ని నిర్వహణకు రూ.3వేలు మంజూరు చేశారు. ఆ నిధులు చాలకపోవడంతో వ్యవసాయ శాఖప్రభుత్వానికి నివేదించింది. రూ.9వేల చొప్పున నిధులు విడుదల చేస్తామని 2020 ఏప్రిల్‌లో అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత 2022 నవంబరులో ఐదు నెలలకు సంబంధించి రూ. 45వేల చొప్పున నిధులు విడుదల చేసింది. అప్పటి నుంచి గత 33నెలలకు చెందిన ఒక్కో రైతు వేదికకు రూ.2.97లక్షలు నిధులు బకాయి ఉంది.

కనీస వసతులు కరువు...

విద్యుత్ బిల్లులు, కనీస మరమ్మతులు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది...

- మిగతా 6వ పేజీలో...

సహాయకులను నియమించాలి



ప్రతీ రైతు వేదికకు ఓ సహాయకుడిని నియమించాలి. పెరిగిపోతున్న విద్యుత్ బకాయిలను విడుదల చేయాలి. వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించి ఎలక్ట్రానిక్ పరికరాలకు మరమ్మతులు చేయాలి. ప్రతీ నెల నిర్వహణ నిధులు మంజూరు చేయాలి.

- అనిల్, ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఓటర్లకు గుర్తింపు కార్డులను జారీచేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న సీఈవో సుదర్శన్ రెడ్డి, పాల్గొన్న కలెక్టర్,అధికారులు

భువనగిరి (కలెక్టరేట్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నమోదు చేసుకున్న ఓటర్లందరికీ తపాలా శాఖ ద్వారా గుర్తింపు కార్డులు అందజేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్ ఎన్నికల కమిషన్ కార్యాలయంనుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. నూతన ఓటర్లుగా నమోదైన ప్రతిఒక్కరికీ తపాలాశాఖ ద్వారా నూతన గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో వందేళ్ల పైబడిన ఓటర్లను గుర్తించి వారి వయస్సును తగిన ఆధారాలతో సమర్పించాలన్నారు. ఫాం 6, 7, 8 దరఖాస్తులను వేగంగా పరిష్కరించి బూత్‌స్థాయి అధికారులు ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వీరారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

చెరువు తూంల లీకేజీల నివారణకు చర్యలు

ఇరిగేషన్ ఈఈ మనోహర్



లక్కారం చెరువు తూంను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ మనోహర్

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చెరువు తూంల లీకేజీలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ ఈఈ మనోహర్, డీఈఈ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని లక్కారం, తంగడపల్లి చెరువులను గురువారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. తంగడపల్లి చెరువు తూం లీకేజీని కొంతమేరకు నివారించామని అధికారులు తెలిపారు. చెరువు కట్టలు, తూంల మరమ్మతు పనులకోసం ప్రతిపాదనలను తయారుచేసి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితోపాటు ఇరిగేషన్ ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.చెరువు తూంనుంచి లీకేజీ జరుగుతుండడంతో నీరు వృథాగా వెళుతుందని, ఇందుకు సంబంధించి తగిన నివారణ చర్యలు తీసుకోవాలని మునిసిపల్ మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ పృథ్వీ పాల్గొన్నారు.

ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ఆత్మకూరు(ఎం), అక్టోబరు 16:(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం మండలంలోని లింగరాజుపల్లి, పల్లెర్ల, కూరెళ్ల గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కేంద్రాలకు తెచ్చిన ధాన్యం అకాల వర్షానికి తడిసిన కూడా కొనుగోలు చేస్తారని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ధాన్యం తూకం వేసిన 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బు జమ అవుతుందన్నారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ముందుగా పల్లెర్ల గ్రామంలో ఎమ్మెల్యే మార్నింగ్‌వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, తహసీల్దార్ వి.లావణ్య, ఎంపీడీవో రాములు నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

- కలెక్టర్ హనుమంతరావు



చిన్న కందుకూరులో విద్యార్థులకు కూర వడ్డిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. చిన్నకందుకూర్ గ్రామంలో గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మధ్యాహ్నభోజనం పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యత తో కూడిన భోజనం ఇవ్వాలన్నారు. అదే విధంగా మం డలంలోని పెద్దకందుకూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయి? ఇప్పటివరకు పూర్తయిన ఇళ్లకు డబ్బులు జమ అయ్యాయా? అని తెలుసుకున్నారు. చిన్నకందుకూర్ గ్రామంలో పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీరోజు ఎంతమంది వస్తున్నారని ఆరా తీశారు. గత నెలలో ఎన్ని డెలీవరీలు అయ్యాయని అడిగారు. పసిపిల్లలకు వ్యాక్సినేషన్ చేస్తున్నారా? అని తెలుసుకున్నారు. అనంతరం అదే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మధ్యాహ్నభోజనం పరిశీలించి విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం ఇవ్వాలన్నారు. ప్రతీరోజు భోజనం ఎలా? పెడతారని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులు ఉన్నారు.

భువనగిరి (కలెక్టరేట్): ప్రజల నుంచి తానే నేరుగా దరఖాస్తులను స్వీకరిస్తానని కలెక్టర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం తన ఛాంబర్‌లో వివిధ స మస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించిన ఆయన తక్షణ పరిష్కారంకోసం ఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుదారుల వివరాలను అధికారులకు తెలిపి కృషి చేయనున్నట్లు వివరించారు.

గోవులతో బహుళ ప్రయోజనాలు

డీఈవో సత్యనారాయణ

భువనగిరి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గోవులతో బహుళ ప్రయోజనాలు ఉంటాయని డీఈవో కే.సత్యనారాయణ అన్నారు. గతవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గోవిజ్ఞాన్ వ్యాసరచన పోటీ విజేతలకు గురువారం భువనగిరిలో ఆయన బహుమతి ప్రదానం చేసి మాట్లాడారు. సనాతన ధర్మంలో ఆవును గోమాతగా పూజించగా, వ్యవసాయరంగానికి గోమాత వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. గోరక్షణకు, వాటిపై అవగాహన కల్పించేందుకు గోసేవ విభాగం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విభాగ్ గోసేవ ప్రముఖ్ కటకం నాందేవ్, కే.మహేందర్, బండిరాజుల శంకర్, తాడెం పాండు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న డీఈవో సత్యనారాయణ

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రామన్నపేట,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు దళారులు, మధ్యవర్తుల మాటలను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పల్లివాడ, మునిపంపుల, కక్కిరేణి గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, టెంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ లాల్ బహదూర్, కార్యదర్శి జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' అమలులో నల్లగొండ నెం.2

- నల్లగొండ జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్



గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్‌కు ల్యాప్ టాప్, ప్రశంసాపత్రం బహూకరిస్తున్న ఆ శాఖ ఎండీ గౌతమ్

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గ్రౌండింగ్, చెల్లింపులు, ఇళ్ల పురోగతిలో నల్లగొండ జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. దీంతో గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వి.గౌతమ్ జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్‌కుమార్‌ను అభినందించడమే కాక, ల్యాప్ టాప్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాకు మొత్తం 19,625 గృహాలు కేటాయించగా, జిల్లా యంత్రాంగం 17,247 గృహాలను మంజూరు చేసింది. ఇప్పటి వరకు 13,581 గృహాలు గ్రౌండింగ్ కాగా, వాటిలో గృహాలు వివిధ దశలలో ఉన్నాయి. వీటిలో కొన్ని గృహాలు పూర్తయ్యాయి. ఒక్క సెప్టెంబరు నెలలోనే జిల్లాలో 5,919 గృహాలు గ్రౌండింగ్ అయ్యాయి. అంతేగాక, సెప్టెంబరు నెలలో జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు రూ.80కోట్లు చెల్లించారు. ఇందిరమ్మ ఇళ్లపై రాష్ట్రవ్యాప్త సమీక్ష సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ అంశాలను పరిశీలించగా, నల్లగొండ జిల్లా గ్రామీణ, పట్టణ ప్రాంత సర్వే, ఇందిరమ్మ ఇళ్ల ఫిజికల్, ఫైనాన్షియల్ పురోగతి, ఎల్ 1, ఎల్ 2, ఎల్3 దరఖాస్తుల పరిశీలన, మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అన్ని రంగాలతోపాటు, చెల్లింపుల్లో కూడా నల్లగొండ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. కాగా మొదటిస్థానంలో నారాయణపేట జిల్లా ఉంది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నల్లగొండ జిల్లా రెండోస్థానంలో నిలిచినందుకు కలెక్టర్ ఇలాత్రిపాఠి గురువారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు జిల్లా యంత్రాంగానికి, గృహ నిర్మాణ శాఖ పీడీకి శుభాకాంక్షలు తెలిపారు.

సెల్లార్లలో దుకాణాలు తొలగించాలి

- జన్మభూమి మడిగల పెండింగ్ అద్దెలు చెల్లించాలి
- అదనపు కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణంలోని వాణిజ్య భవనాల సెల్లార్లలో అక్రమంగా నిర్వహిస్తున్న దుకాణాల స్వచ్ఛంద తొలగింపునకు, జగదేవ్‌పూర్ చౌరస్తాలోని జన్మభూమి మడిగల పెండింగ్ అద్దెల చెల్లింపునకు అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు డెడ్‌లైన్ విధించారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన రెండు వేర్వేరు సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సెల్లార్లను కేవలం వాహనాల పార్కింగ్‌కు మాత్రమే వినియోగించాలని, అక్రమంగా నిర్వహిస్తున్న దుకాణాలను నిర్దేశిత తేదీలోపు స్వచ్ఛందంగా భవన యజమానులు తొలగించాలన్నారు. సెల్లార్ ఉన్న భవనాల ముందు రహదారిపై వాహనాలను నిలిపి ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే జన్మభూమి మడిగల పెండింగ్ అద్దెలను నెలాఖరులోపు చెల్లించాలని, తామే దుకాణాలను నిర్వహించుకుంటున్నట్లు అఫిడవిట్ ఇవ్వాలని సూచించారు. లీజుకు ఇచ్చినట్లు తేలితే మునిసిపాలిటీ మడిగెలను స్వాధీనం చేసుకుని ఇతరులకు కేటాయిస్తుందన్నారు. ఈ దిశగా చర్యలు చేపట్టాలని మునిసిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ జి.రామలింగం, డీఈ కొండల్‌రావు, మేనేజర్ హరీష్‌రెడ్డి, టీపీఎస్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి



నూతన కార్యవర్గంతో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, వంగ రవీందర్ రెడ్డి

భువనగిరి (కలెక్టరేట్),అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా)కృషి చేస్తుందని సంఘం రాష్ట్రఅధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల అధికారిగా నారాయణరెడ్డి వ్యవహరించగా స్థానిక ఓ హోటల్‌లో జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ట్రెసా జిల్లా అధ్యక్షుడిగా ఎం.కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆర్.శ్రీకాంత్, కోశాధికారిగా జానయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా ఎండీ లాయక్ అలీ, సీహెచ్ శోభతోపాటు మరో 19మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వంగ రవీందర్‌రెడ్డి, ఉద్యోగ జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వీరారెడ్డి,ఆర్డీవో కృష్ణారెడ్డి,టీఎన్జీవో టీజీవో అధ్యక్షుడు భగత్,జగన్మోహన్ ప్రసాద్, నిరంజన్, తహసీల్దార్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.


రైతు బజారులో విద్యార్థుల నాటక ప్రదర్శన



రైతు బజార్‌లో నాటకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

భువనగిరిటౌన్,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): భువనగిరిలోని జీనియస్ హైస్కూల్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం పలు ప్రాంతాలను సందర్శించారు. పంటపొలాలు, అగ్నిమాపక కేంద్రం, రైల్వేస్టేషన్లను సందర్శించారు. ఆరోగ్యకరమైన ఆహారం, పోషకాహారాల ప్రాధాన్యంపై రైతుబజార్‌లో నాటకం రూపంలో అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు భవాని, సిహెచ్ సింధు, ఉమాదేవి, కొండారెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో..



సూర్యాస్తమయ సమయంలో ఆకాశం అంచులు స్వర్ణవర్ణంతో నిండిపోగా చెరువులోని నీటి అలలపై బంగారు కాంతులు కనువిందు చేశాయి. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పెద్ద చెరువు వద్ద గట్టుపై చెట్లకొమ్మల చాటున నీటిపై కాంతి కిరణాలు విరాజిల్లుతుండగా జీవనగమనంలో ప్రకృతితో కలిసి పాడిగేదెలు అడుగులు కలిపాయి. నీటి అలల మీదుగా దూరంగా మసకబారి కనిపిస్తున్న ఎత్తైన ఎయిమ్స్ భవన సముదాయాల సమూహం.. పల్లె జీవనం మధ్య సమతుల్యాన్ని ఇక్కడి ప్రకృతి దృశ్యాలు ఆవిష్కరించాయి. ఈ ఆహ్లాదకర దృశ్యాలు 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి.

- బీబీనగర్, ఆంధ్రజ్యోతి





గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

నేరేడుగొమ్ము, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విహారయాత్రకు వచ్చి కృష్ణానదిలో గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. నేరేడుగొమ్ము ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినెపల్లి మండలం ఖానాపూర్‌కు గ్రామానికి చెందిన పృధ్విరాజ్(30) ఈ నెల 14న స్నేహితులతో కలిసి నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీ కృష్ణా పరివాహక ప్రాంతంలో విహారయాత్రకు వచ్చాడు. పడవలో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి నీట మునిగాడు. గజ ఈతగాళ్ల సహకారంతో పోలీసులు రెండు రోజులుగా కృష్ణానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం పృధ్విరాజ్ మృతదేహం లభించింది. మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పృధ్విరాజ్ తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు రోజుల క్రితం అదృశ్యం.. బావిలో మృతదేహం

అడ్డగూడూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం వ్యవసాయ బావిలో లభ్యమైంది. ఈ సంఘటన యాద్రాది భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని జానకీపురం గ్రామంలో జరిగింది. ఎస్.ఐ వెంకట్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. జానకీపురం గ్రామానికి చెందిన కట్కూరి లక్మయ్య(86) ఈ నెల 14వ తేదీన ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని వారి కుటుంబ సభ్యులు 15వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా లక్మయ్య మృతదేహం వ్యవసాయ బావిలో లభించిందనే సమాచారం వచ్చింది. మృతదేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని దహన సంస్కారాల కోసం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

చివ్వెంల అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని బీబీగూడెంలో గురువారం జరిగింది. ఎస్ఐ మహేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బీబీగూడెం శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేశారు. బీబీగూడెం గ్రామానికి చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి జువైనల్ కేసుల విచారణ

భువనగిరి టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా జువైనల్ జస్టిస్ బోర్డును ఈ నెల 18న ప్రారంభిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఏ. జయరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరిలోని పాత బస్టాండ్ సమీపంలోని మునిసిపల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన బోర్డు కార్యాలయంలో వారంలో ఒకరోజు జువైనల్ కేసులను విచారించనున్నట్టు తెలిపారు. భువనగిరి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ ఇన్‌చార్జి న్యాయమూర్తిగా వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలో సుమారు 70కిపైగా జువైనల్ కేసులు ఉన్నాయి. విచారణ నిమిత్తం ఇప్పటివరకు నల్లగొండకు వెళ్తున్న యాదాద్రిభువనగిరి జిల్లా జువైనల్ కక్షిదారులు ఇకనుంచి భువనగిరిలోనే విచారణకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వారికి దూరభారం తప్పనుంది. జువైనల్ బోర్డులో ఇద్దరు సభ్యుల నియామానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో నల్లగొండకు జిల్లా జువైనల్ బోర్డు సభ్యుడు మోహన్‌రావు జిల్లా ఇన్‌చార్జి సభ్యుడిగా విచారణలో పాల్గొననున్నారు.

అనుమానితులపై సమాచారం ఇవ్వాలి : ఏసీపీ

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అనుమానితులు తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. డ్రగ్స్, సైబర్ మోసాలు, గంజాయిపై యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట గ్రామంలో యువకులు, గ్రామస్థులకు గురువారం అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి సేవించి జీవితాలను బలిచేసుకోవద్దన్నారు. వాటిని విక్రయించినా, సేవించినా వెంటనే పోలీసులు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దొంగతనాలు జరగకుండా ప్రతిఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాటి ద్వారా దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి శిక్షించవచ్చునని అన్నారు. గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 112కి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బొడ్డుపల్లి భాస్కర్, ఎస్ఐలు సుధాకర్, యాదయ్య, కృష్ణస్వామి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వివాహిత బలవన్మరణం

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో గురువారం జరిగింది. సీఐ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... యాదగిరిగుట్ట మునిసిపాలిటి పరిధిలోని యాదగిరిపల్లికి చెందిన ఈర్ల స్వప్న(35) నాలుగు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. స్వప్నకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్వప్న తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యే గారూ.. జర మా'గోడు' చూడరూ

మునుగోడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మునుగోడు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని సానబండ ఆవాసగ్రామ రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. దీంతో గ్రామ ప్రజలు రాకపోకలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా రోడ్డు బాగు కాలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమస్యను ఎత్తిచూపుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఫొటోతో ఫ్లెక్సీతో పేరుతో గురువారం మధ్యాహ్నం సమయంలో మునుగోడు- చండూరు ఆర్అండ్‌బీ రహదారి నుంచి సానబండకు వెళ్లే రోడ్డులో ఉంచారు. 'జర మాగోడు చూడరా ఎమ్మెల్యే గారు.. మా ఊరి రోడ్డు కోసం చిన్న ప్రయత్నం' అంటూ రాసి ఉన్న ఫ్లెక్సీ ఉంచారు.



సానబండ ఆవాసగ్రామ రోడ్డుపై ఉంచిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీ

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

కొండమల్లేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువ రైతు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన జటమోని శ్రీను, వెంకటమ్మ దంపతుల పెద్ద కుమారుడు జటమోని వెంకటేష్(23) గురువారం ఉదయం తన వ్యవసాయ పొలాన్ని చూడడానికి బావి వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడ విద్యుత్ వైర్లు తెగి పడి ఉన్నాయి. ఈ క్రమంలోని వెంకటేష్ కాలికి విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పొలం వద్దకు వచ్చి చూడగా వెంకటేష్ విగతజీవిగా పడి ఉన్నాడు. విద్యుత్ తీగలు పడి ఉండడంపై నాలుగు రోజుల క్రితం ఏఈ, జూనియర్ లైన్‌మన్‌కు ఫిర్యాదు చేసినా విద్యుత్ అధికారులు పట్టించుకోలేదని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందని కుటుంబసభ్యులు ఆరోపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

మృతదేహంతో విద్యుత్ ఉప కేంద్రం ఎదుట ధర్నా

విద్యుత్ అధికారుల నిర్లక్షంతోనే వెంకటేష్ మృతిచెందాడని ఆరోపిస్తూ బంధువులు కొండమల్లేపల్లిలోని విద్యుత్ ఉప కేంద్రం ఎదుట మృతదేహంతో ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అజ్మీరా రమేష్, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి అక్కడికి చేరుకొని నచ్చజెప్పి ధర్నా విరమింపజేయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చేతికొచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. వెంకటేష్ తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.





రోదిస్తున్న కుటుంబసభ్యులు, వెంకటేష్(ఫైల్)

ఇనుప తీగపై దుస్తులు ఆరేస్తుండగా..

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఊట్లపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు, తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిరిశాల నర్సమ్మ(58) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. బుధవారం పనికి వెళ్లి రాత్రి ఇంటికి చేరుకున్న ఆమె ఇంటి ఆవరణలోని ఇనుప తీగపై తడి దుస్తులు ఆరేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా జరిగి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు రాత్రి 9గంటల తర్వాత విద్యుదాఘాతానికి గురికాగా, స్థానికులు గమనించలేదు. గురువారం ఉదయం తోటి కూలీలు పనికి పిలిచేందుకు ఇంటికివెళ్లగా నర్సమ్మ ఇంటి ఆవరణలో విగతజీవిగా పడి ఉంది. గమనించిన స్థానికులు వృద్ధురాలి నివాసానికి కొంత దూరంగా నివాసముంటున్న కుమారుడు లింగయ్యకు సమచారమిచ్చారు. నర్సమ్మ భర్త మల్సూర్ గతంలో మృతిచెందాడు. ఒంటరిగా ఓ గదిలో నివాసముంటూ కూలిపనులకు వెళ్లి జీవనం సాగిస్తోంది. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

21 నుంచి పోలీస్ ఫ్లాగ్‌డే కార్యక్రమాలు

సూర్యాపేటక్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు సూర్యాపేట జిల్లాలో పోలీస్‌ఫ్లాగ్‌డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కొత్తపల్లి నర్సింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ రక్షణలో అమరులైన పోలీసులను స్మరిస్తూ జిల్లావ్యాప్తంగా నిర్వహించే ఫ్లాగ్‌డే కార్యక్రమాల్లో యువత, విద్యార్థులు భాగస్వాములై పోలీసులకు నివాళులర్పించాలన్నారు. పోలీసుల విధులు, టెక్నాలజీ ఉపయోగం, ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడంతో పాటు రక్తదాన శిబిరం, అమరుల కుటుంబాలను సందర్శిస్తామని తెలిపారు. పోలీసుల ప్రతిభ తెలిపే లఘు చిత్రాల పోటీలు, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 'డ్రగ్స్ నివారణలో పోలీస్ పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండగలరు' అనే అంశాలపై ఆన్‌లైన్‌లో 500 వాక్యాల్లో వ్యాసం రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

24 గంటల్లో పుస్తెలతాడు దొంగ పట్టివేత

● మహిళపై దాడి చేసిన బంగారు పుస్తెలతాడు అపహరణ

శాలిగౌరారం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి చేసి బంగారు పుస్తెలతాడును అపహరించిన నిందితుడిని పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను గురువారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని శాలిగౌరారం పోలీసు సర్కిల్ కార్యాలయంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి వెల్లడించారు. నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన ఆకుల సావిత్రమ్మ బుధవారం మాదారం గ్రామ శివారులో ఉన్న తన పొలానికి నడుచుకుంటూ వెళ్తుండగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన నాగుల శ్రీనివాస్ స్కూటీపై వచ్చి ఆమెపై దాడి చేసి ఐదు తులాల బంగారు పుస్తెలతాడు చోరీ చేసి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శాలిగౌరారం ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర ఆదేశాల మేరకు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో నకిరేకల్, శాలిగౌరారం సీఐల ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని కోణాల్లో నిందితుడి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. ఆచూకీలో భాగంగా నిందితుడు నాగుల శ్రీనివాస్ గురువారం ఉదయం నల్లగొండలో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. వెంటనే అతడిని పట్టుకొని విచారించగా చోరీ చేసిన విషయం ఒప్పుకున్నాడు. తాను నల్లగొండలోని పద్మానగర్‌లో ఉంటున్నట్లు తెలిపారు. తన ఇద్దరు అమ్మాయిల పెళ్లిళ్లు చేశానని, భార్య ఆరోగ్యం బాగాలేనందున అప్పులు చేశానని నిందితుడు చెప్పాడు. ఈ క్రమంలో బుధవారం ఓగోడు నుంచి మాదారం వెళ్తున్న మహిళను గుర్తించి లిఫ్ట్ పేరుతో స్కూటీపై ఎక్కించుకొని మార్గ మధ్యలో దింపి దాడి చేసి పుస్తెల తాడును చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. చోరీ చేసిన బంగారు పుస్తెలతాడును నల్లగొండలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ. 3.11లక్షలు రుణం తీసుకొని రూ.61 వేలు తన సొంత అవసరాలకు వాడుకొని రూ.2.50లక్షలు నేరాలు చేయడానికి తన వద్ద ఉంచుకున్నాడని డీఎస్పీ తెలిపారు. నగదు, స్కూటీని, దాడి చేసిన ఇనుప రాడ్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, నకిరేకల్ సీఐ వెంకటేశ్వర్లు, శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి ఎస్ఐలు డి. సైదులు, లచ్చిరెడ్డి, ఉప్పల సతీష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

చాయ్ అడ్డాల్లో

గంజాయి వాసన?

సిగరెట్ల ముసుగులో గంజాయి పీలుస్తున్న ఆకతాయిలు

భువనగిరి టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొన్ని చాయ్ అడ్డాలు గాడి తప్పి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ఫ్రాంఛైజ్ విధానంలో టీ అడ్డాలు ఏర్పాటు చేసుకున్నారు. పట్టణాలు, గ్రామాల్లో చౌరస్తాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాలు, రహదారుల వెంట కొంత కాలంగా టీ అడ్డాలున్నాయి. కొన్ని అడ్డాలు సక్రమంగానే కొనసాగుతున్నప్పటికీ మరికొన్ని గంజాయి వాసనతో గుప్పుమంటున్నాయి. కొన్ని అడ్డాల పరిసరాలు శుభ్రంగా ఉంటున్నప్పటికీ మరికొన్ని అడ్డాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పీల్చి పడేసిన సిగరెట్లు, టీ కప్పులు ఇతర వ్యర్థాలు పేరుకుపోతూ పరిశుభ్రతకు ఆటంకంగా మారుతున్నాయి. దీంతో చాయ్, కాఫీ, బిస్కెట్స్ సమోసా తదితర స్నాక్స్‌తో రిలాక్స్ కోసం అడ్డాలకు వెళ్లాలనుకుంటున్న కొద్దిమంది వెనకాడుతున్న పరిస్థితి నెలకొంది. కొన్ని చాయ్ అడ్డాలు ఆకతాయిల గంజాయి వాసనతో గుప్పుమంటున్నాయి. కొద్దిమంది చాయ్ అడ్డాల్లో గంటల తరబడి ఉంటూ గంజాయి నింపిన సిగరెట్లు పీల్చుతున్నారు. మిగిలిన సిగరెట్ పీకలను అక్కడే పడేస్తున్నారు. ఈ తతంగం కొంతమంది అడ్డాల నిర్వాహకుల కనుసన్నల్లోనే జరుగుతుండగా మరి కొన్నింటిలో మాత్రం చాయ్ పేరిట గుమికూడుతూ తమపని కానిచ్చుకొని పోతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా అడ్డాల నిర్వాహకులు, అధికారులు అప్రమత్తం కాకుంటే గంజాయి విక్రయాలు, సేవించడం మరింతగా ప్రబలే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిఘా ఉంచాం



కొన్ని టీ అడ్డాల వద్ద కొద్దిమంది రహస్యంగా గంజాయి సిగరెట్లు తదితర మాదక ద్రవ్యాలు సేవిస్తున్నట్టు వస్తున్న ఫిర్యాదులతో వాటిపై ప్రత్యేకంగా నిఘా పెట్టాం. కొన్ని అడ్డాల్లో ఆకస్మిక తనిఖీలు చేశాం. చాయ్ అడ్డాల నిర్వహకులు జాగ్రత్తలు పాటించాలి. సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి 9వరకు చాయ్ దుకాణాలు మూసివేయాలి. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై సమాచారం ఇవ్వాలి.

● ఎం, రమేష్, ఇన్‌స్పెక్టర్, భువనగిరి టౌన్.

కేటీఆర్‌పై పోలీసులకు ఫిర్యాదు



కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యువజన కాంగ్రెస్ కార్యకర్తలు

భువనగిరి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి బీఆర్ఎస్ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముందుగా కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ ఓర్వలేక కేటీఆర్ సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం చేస్తున్నారని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్ ఆరోపించారు.

ప్రమాదం.. తప్పని ప్రయాణం

● వానొస్తే నాలుగు గ్రామాలకు రాకపోకలు బంద్ ● వర్షాలకు తెగిన బంకాపురం కల్వర్టు ● విద్యార్థులకూ తప్పని వాగు కష్టాలు ● గతంలో వాగు దాటుతూ నీటిలో జారిపడి మహిళ మృతి

వర్షం వస్తే ఆ నాలుగు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ప్రమాదమే అయినా తప్పని పరిస్థితుల్లో వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని నిడమనూరు నుంచి బంకాపురం, వెనిగండ్ల, సూరెపల్లి గ్రామాలకు వెళ్లేందుకు ఉన్న వంతెన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, నిడమనూరు)

నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని నిడమనూరు-బంకాపురం గ్రామాల నడుమ చిలుకల వాగుపై పూర్వకాలంలో నిర్మించిన కల్వర్టు పూర్తిగా ధ్వంసమై ప్రమాదస్థితికి చేరింది. కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అనేకసార్లు తెగిపోయింది. మండలంలోని బంకాపురం, వెనిగండ్ల, సూరేపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ కల్వర్టు మీదుగా మండలకేంద్రానికి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వర్షాలు కురవడంతో పాటు నిడమనూరు చెరువు నిండి అలుగు పోస్తే కల్వర్టు మీదుగా ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తుంటుంది. దీంతో వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. 14వ మైలురాయి చెక్‌పోస్టు మీదుగా ఆయా గ్రామాలకు ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు పొంగడంతో అనేకసార్లు రాకపోకలు నిలిచిపోయాయి. కల్వర్టు పూర్తిగా శిథిలం కావడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. కల్వర్టు తెగిపోయి ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ కల్వర్టు స్థానంలో బ్రిడ్జి నిర్మించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పూర్తిగా శిథిలమై ప్రమాదస్థితిలో ఉన్న బంకాపురం కల్వర్టు మీదుగా ప్రమాదమని తెలిసినా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఉంది. ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు వరద నీరు ముంచెత్తిన కల్వర్టు మీదుగా నడుస్తున్నారు. గతంలో నిడమనూరు ఆదర్శ పాఠశాలలో వాచ్‌ఉమెన్‌గా పని చేస్తున్న ఓ మహిళ వాగు దాటుతూ ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి గూనల్లో ఇరుక్కుని మృతిచెందింది. భార్య మరణాన్ని తట్టుకోలేక ఆమె భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. బంకాపురం గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాక్టర్ కూడా కల్వర్టులో పడిపోయింది. గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా టెండర్లు ఖరారు కాకపోవడంతో నిర్మాణం ఆగిపోయింది. ప్రస్తుతం కూడా రూ.మూడు కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. కల్వర్టు స్థానంలో సత్వరమే వంతెన నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నిడమనూరు-బంకాపురం గ్రామాల మధ్య చిలుకల వాగుపై తెగిన కల్వర్టు మీదుగా వెళ్తున్న విద్యార్థులు

వంతెన నిర్మించాలి



నిడమనూరు-బంకాపురం గ్రామాల మధ్య కల్వర్టుపై వంతెన నిర్మించాలి. ఈ కల్వర్టు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా వంతెన నిర్మించడం లేదు. వర్షాలు కురిసినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోవడంతో అనేక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే వాగుపై వంతెన నిర్మించాలి.

● కొప్పెర నాగయ్య, బంకాపురం గ్రామం.

గాడ్సే ఆరాధకులే కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం

- ప్రజల్లో కాంగ్రెస్‌కు బలం పెరిగింది
- ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వంత్ రాజా మహతి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వంత్ రాజా మహతి, వేదికపై ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

మిర్యాలగూడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గాడ్సే ఆరాధకులే కాంగ్రెస్ పార్టీపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం నిర్వహిస్తున్నారని ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వంత్ రాజా మహతి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ కాంగ్రెస్ కార్యాలయంలో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా పీసీసీ కోఆర్డినేటర్ వెంకటరమణతో కలిసి డీసీసీ ప్రెసిడెంట్ ఎన్నికపై అభిప్రాయాలు సేకరించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, మహిళా యూత్, కార్మిక, విద్యార్థి విభాగాల నేతలు, కాంగ్రెస్ ముఖ్యనేతలతో సమావేశమై మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రజలకోసం ప్రాణం ఇచ్చిన గాంధీని చంపిన గాడ్సేను కీర్తించే వారు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారన్నారు. రాజ్యాంగ రక్షణ, దేశ సంపద రక్షణ కోసం రాహుల్‌గాంధీ పోరాడుతున్నారని అన్నారు. దేశంలో 5000 కిలో మీటర్ల పాదయాత్రచేసి బీజేపీ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్‌కు ప్రజాబలం పెంచారన్నారు. ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో రాహుల్ గాంధీని ప్రధానిచేసే దిశగా కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ బలంగా ఉందన్నారు. రికార్డుస్థాయి మెజార్టీతో నల్లగొండ ఎంపీని గెలిపించారన్నారు. పార్టీ అభివృద్ధికి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ దేశ ప్రజలకు కాంగ్రెస్ పాలనలోనే మేలు జరిగిందన్నా రు. జవహర్‌లాల్ నెహ్రూ కాలంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి వ్యవసాయరంగాన్ని బలోపేతం చేశారన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలవల్ల ప్రజలకు జరిగిన మేలును వివరించాలన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్ష పదవికి చిరుమర్రి కృష్ణయ్య, పగిడి రామలింగం యాదవ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, మైనార్టీ నాయకులు సలీం తదితరులు నామినేషన్లు అందజేశారు. అనంతరం గుండెపోటుతో మరణించిన మాజీ కౌన్సిలర్ రామకృష్ణ సంస్మరణసభకు హాజరై చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, నాయకులు స్కైలాబ్ నాయక్, చిలుకూరి బాలు, పొదిల శ్రీనివాస్, గాయం ఉపేందర్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, సైదులు, జానకిరాంరెడ్డి, అజహర్, పోలగాని వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు కేటాయించాలి

మిర్యాలగూడ టౌన్: డీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు కేటాయించాలని కోరుతూ ఏఐసీసీ పరిశీలకుడికి కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, కుప్పాల సుబ్బారావు, పగిడిమర్రి గోవర్ధనాచారి, బి. కిరణ్, వెంకటేశ్వర్లు, రామలింగయ్య పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్ష పదవికి తన పేరును పరిశీలించాలని కోరుతూ కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ ఎంఏ సలీం ఏఐసీసీ పరిశీలకుడికి దరఖాస్తు అందజేశారు.

వీధివ్యాపారులకు భరోసా

- పీఎం స్వనిధితో ఆర్థిక బలోపేతం


సూర్యాపేటలో రోడ్డు పక్కన వీధి వ్యాపారులు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)

ప్రధాన మంత్రి స్వనిధి రుణాలతో వీధివ్యాపారులు అభివృద్ధి బాటలో పయనిస్తున్నారు. ప్రధానమంత్రి స్వనిధి రుణా లు తీసుకుంటున్న అర్హులైన వీధివ్యాపారులు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. ముఖ్యంగా మునిసిపాలిటీ పరిధిలో వీధుల వెంట చిరువ్యాపారాలు చేసుకునే వ్యా పారులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రధాన మంత్రి స్వనిధి రుణాల దరఖాస్తులను ఆహ్వానించింది. గత 5సంవత్సరాల నుంచి వీధివ్యాపారులు ఈ రుణాలు పొందుతున్నారు. వీధివ్యాపారులకు అందించే ఈ రుణాలను లోక్ కళ్యాణ్ మేళాతో అందిస్తున్నారు. సామాజిక భద్రత కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు అనుసంధానం చేసి, ఆపథకాలకు అర్హులుగా ఎంపిక చేస్తారు.

పెరుగుతున్న ఆసక్తి

గతనెల 17వతేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు వీధి వ్యాపారులకు రుణాల ప్రక్రియపై శిబిరాలు నిర్వహించారు. అయితే గత ఐదేళ్లుగా వీధి వ్యాపారులకు రుణాలు అందిస్తుండగా ఈ ఏడాది రుణాలు తీసుకునే అర్హులైన వారు పెరిగారు. లోక్ కళ్యాణ్ పేరుతో అందించే రుణాల మొత్తాన్ని కూడా పెంచారు. మొదటి విడతలో రూ. 10వేలు అందజేయగా ప్రస్తుతం లోక్ కళ్యాణ్ మేళాతో రూ.15 వేలకు పెంచారు. మొదటి విడత సక్రమంగా చెల్లిస్తే తిరిగి రూ. 25వేలు అదేవిధంగా మూడో విడతలో రూ.50వేలు అందిస్తున్నారు. జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరమలగిరి, నేరేడుచర్ల మొత్తం 5మునిసిపాలిటీలు ఉన్నాయి. వీటిలో మొత్తం వీధివ్యాపారులు 11,610 మంది ఉన్నారు. వీరంతా రుణాలు తీసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అర్హులైన వీధి వ్యాపారులు లోక్‌కళ్యాణ్‌మేళా పేరుతో అందిస్తున్న రుణాలను స్వీకరించి ఆర్థికంగా బలోపేతం కావాలి. సక్రమంగా రుణాలు చెల్లించినట్లుయితే అధిక రుణాలు పొందే అవకాశం ఉంది.

- హన్మంతరెడ్డి, మునిసిపల్ కమిషనర్, సూర్యాపేట

శిక్షకుడిగా..న్యాయనిర్ణేతగా..

- రిఫరీగా రాణిస్తున్న మఠంపల్లి ఉపాధ్యాయుడు

మఠంపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచే వాలీబాల్‌పై ఉన్న మక్కువతో జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదిగారు సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన మన్నెం సీతారాంరెడ్డి. క్రీడలపై తనకున్న అభిరుచితో బీఎస్సీ బీపీఈడీ పూర్తిచేసి వ్యాయామ ఉపాధ్యాయుడిగా కొలువు సాధించారు. వృత్తిధర్మాన్ని నెరవేరుస్తూనే వాలీబాల్ శిక్షణను ప్రవృత్తిగా ఎంచుకొని మహిళా జట్లకు తర్ఫీదు ఇస్తూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. పలుమార్లు రాష్ట్రస్థాయి క్రీడలకు న్యాయ నిర్ణేత(రిఫరీ)గా, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర వాలీబాల్ పోటీలకు పరిశీలకుడిగా (అబ్జర్వర్)గా కూడా వ్యవహరించారు. ఐదేళ్లుగా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వేసవి లో నిర్వహించే క్రీడల శిక్షణ శిబిరంలో ఉచితంగా సేవలు అందిస్తున్నారు. 2023 సెప్టెంబరు 5న జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుతం చిలుకూరు మండలం పాలె అన్నారం జడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీ (ఫిజికల్ డైరెక్టర్)గా పని చేస్తున్నారు. 2015 నుంచి వాలీబాల్ కోచ్‌గా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రిఫరీగా వ్యవహరిస్తున్న సీతారాంరెడ్డి ఇటీవల పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన అ డర్-17 బాల, బాలికల రాష్ట్ర టోర్నమెంట్‌కు పరిశీలకుడిగా వ్యవహరించారు. ఇప్పటి వరకు శిక్షణ ఇచ్చిన విద్యార్థుల్లో ఆరుగురు జాతీయ స్థాయికి, 40 మంది రాష్ట్రస్థాయికి రగ్బీలో 20 మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు సీతారాంరెడ్డి తెలిపారు. 2023లో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో సూర్యాపేట మహిళా జట్టుకు కోచ్‌గా వ్యవహరించానని, జిల్లా స్థాయిలో ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకోవడం ఆనందాన్ని కలిగించిందని ఆయన తెలిపారు.


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న పీడీ సీతారాంరెడ్డి



శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉంది

వృత్తిధర్మాన్ని నెరవేరుస్తూనే వాలీబాల్‌లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉంది. తన వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు ఉన్నత స్థాయి ఎదగి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాలనదే లక్ష్యం. రానున్న రోజుల్లో మరిన్ని సేవలను అందిస్తా.

-మన్నెం సీతారాంరెడ్డి , పీడీ

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు


గుండాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుండాల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేం ద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు ఎంపిక య్యారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సర విద్యార్థి అల్లె అనుష్క(కబడ్డీ), ఎంపీసీ మొదటి సంవత్స రం విద్యార్థి కొర్న సాత్విక, మాలవిక(వాలీబాల్) రాష్ట్ర స్థాయి అండర్ -19 పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాము తెలిపారు. ఈసందర్భంగా గురువారం వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వ్యా యామ ఉపాధ్యాయులు మహేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఆత్మకూర్ (ఎస్) విద్యార్థిని

ఆత్మకూర్(ఎస్) : సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో మోడల్ స్కూల్ విద్యార్థిని వి.సుప్రియ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సుప్రియను ఆయన అభినందించి ఆయన మాట్లాడారు. సుప్రియ పట్టుదలతో రాష్ట్ర స్థాయికి చేరుకోవడం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాక్షించారు. సుప్రియ 10వ తరగతి చదువుతోంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూతం యాకమల్లు, శ్రీను, కృష్ణయ్య, కరుణాకర్, జ్యోతి, సుధాకర్, తిరుమల్లేష్, గణేష్‌బాబు, శ్రీధర్, రంగారెడ్డి, సంతోష్, లక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.


సుప్రియ

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి


బంద్ పోస్టర్ అవిష్కరిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

నల్లగొండ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం (రేపు) రాష్ట్ర బంద్‌కు విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు కోరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బంద్ విజయ వంతం చేయాలని రూపొందించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంద్‌ను విజయవంతం చేయడానికి నేడు నల్లగొండ ఎన్‌జీ కళాశాల గ్రౌండ్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు, ఈ ర్యాలీలో అన్ని రాజకీయ పార్టీలు, బీసీ,ఎస్సీ సంఘాలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బీసీ న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలో

18న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన జిల్లా కోర్టు ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు జెనిగల రాములు, గిరిలింగయ్య గౌడ్ మాట్లాడుతూ బంద్‌కు ప్రతి ఒక్కరూ సంఘీభావం ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జవహర్‌లాల్, నేతి రఘుపతి, ఎండీ నజీరుద్దిన్, సత్తయ్య,పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టు గేట్లు మూసివేత


మూసివేసిన నాగార్జునసాగర్ గేట్లు

నాగార్జునసాగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక తగ్గింది. దీంతో ప్రాజెక్టు అధికారులు క్రస్ట్ గేట్లను గురువారం మూసివేశారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 589.30 అడుగులు (309.9534 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10040 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 7852 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 34,713 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 53,805 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 63,805 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి వరదకాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతోంది. గురువారం సాయంత్రానికి 3613. 17క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదయ్యింది. ప్రాజెక్టు 3,8 నంబరు క్రస్టుగేట్లను 2 అడుగుల మేర ఎత్తడం ద్వారా 2748.70క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే ప్రాజెక్టు కుడి, ఎడ మ కాల్వల ఆయకట్టుకు విడుదలవుతున్నమరో 195.12క్యూసెక్కుల నీటిని కలుపుకుని ప్రాజెక్టు నుంచి 2995.44 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.40అడుగులు(4.30టీఎంసీలు)గా ఉంది.

సహకార కుబేర డిపాజిట్లకు అధిక వడ్డీ

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల్లో కుబేర డిపాజిట్లకు అధిక వడ్డీ ఇస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కేంద్ర సహకార బ్యాంకు మునుగోడు బ్రాంచ్ గురువారం ఆధ్వర్యంలో పక్షం రోజుల పాటు నిర్వహించే సహకార కుబేర డిపాజిట్ల మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన ప్రారంభించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకులో 222 రోజులు కాలపరిమితికి డిపాజిట్లు చేసిన ప్రతి ఖాతాదారులకు 7.5% వడ్డీ, సీనియర్ సిటీజన్లకు 8.15%వడ్డీ చొప్పున ఇవ్వనున్నట్లు వివరించారు. బ్యాంకు ద్వారా పంటలు, వ్యవసాయ భూ ములు తాకట్టు, ఇంటి నిర్మాణాలతో పాటు మహిళా సంఘాలకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఇచ్చే రుణాలు, కుబేర డిపాజిట్లకు అధిక వడ్డీలను ఖాతాదారులు సద్వినియోగ పరుచుకోవాలన్నారు. డీసీసీబీ మేనేజర్ రాగిని, సూపర్‌వైజర్ నరేష్, అకౌంటెంట్ ఆసినా, నిఖిత, పీఏసీఎస్ కార్యదర్శి సుఖేందర్, అశోక్ రెడ్డి, పురుషోత్తం, స్వామినాథ్, లింగస్వామి, రైతులు పాల్గొన్నారు.


డిపాజిట్ల మహోత్సవం ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి : ఏఐఎస్‌ఎఫ్

నల్లగొండ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పెండింగ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు ప్రభుత్వం వెంటనే వారం రోజుల్లో విద్యార్థుల ఫీజు బకాయిలు మొత్తం విడు దల చేయకపోతే ప్రభుత్వంపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలమల అంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్ బాబు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వా మివారి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామివారిని దివ్యమనోహరంగా అలంకరించిన అర్చ కులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణ తంతు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వా మికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 11,30,030 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

మేళ్లచెర్వు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలోని శివాలయంలో లింగాన్ని గురువారం సూర్యకిరణాలు తాకాయి. బహుళదశమి రోజున పరమశివుడికి ప్రీతి ప్రదమైన కార్తీకమాసానికి ఆరంభానికి, శుభసూచికగా సూర్యోదయం అనంతరం ఆ ఉదయం 6.30 నుంచి 6.45 నిమిషాల వర కు స్వామి వారి పాదాల నుంచి మూల విరాట్ మొత్తాన్ని సూర్యకిరణభిషేకాలు జరిగాయి. ప్రతి సంవత్సరం కార్తీకమాసానికి, మహాశివరాత్రికి ఐదు రోజుల ముం దు నుంచి శివలింగానికి సూర్యకిరణాభిషేకాలు జరుగుతుంటాయని ఆలయ అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ తెలిపారు. సూర్యకిరణాలు తాకిన స్వామివారిని చూడటానికి భక్తులు బారులు తీరి స్వామి వారికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకం, నిర్వహించారు. కార్యక్రమంలో శివభక్తులు, అయ్యప్ప భక్తులు, సాదాంరణ భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

2న సాయిబాబా జీవిత చరిత్ర సంపూర్ణ నాటక ప్రదర్శన

చిట్యాలరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సాయిబాబా జీవిత చరిత్ర సంపూర్ణ నాటక ప్రదర్శన నవంబరు 2వ తేదీన నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని ముప్ప మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు సాయిగురు కేవీబీ స్వామి, సాయిపురోహిత్ వి.రమణమూర్తి తెలిపారు. చిట్యాల మండలం వట్టిమర్తి బస్‌స్టేజీ సమీపంలో రహదారి పక్కన గల సాయిబాబాఆ లయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వధ్యాహ్న హారతి కార్యక్రమం అనంతరం వారు భక్తులనుద్దేశించి మాట్లాడారు. సంపూర్ణ మానవత్వంతో మనిషిని మనిషిగా ప్రేమించడమే సాయి పూజ అని అదే దైవత్వమన్నారు. నవంబరు 2వ తేదీన ప్రదర్శనలో భాగంగా మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6గంటల వరకు అఖండ సాయినామ సంకీర్తన నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేసి సాయిబాబా ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాయిసేవకులు హైమా, వాణి, నర్మద, డాక్టర్ గాంధీ, సేవకులు పాల్గొన్నారు.


సాయిబాబా ఆలయంలో మాట్లాడుతున్న కేవీబీ స్వామి, రమణమూర్తి

జాతీయస్థాయి పోటీలకు సాంకేతిక అధికారిగా అనిల్‌కుమార్

భువనగిరి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : భువనగిరికి చెందిన అంతర్జాతీయ మాస్టర్ క్రీడాకారుడు, ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్‌కుమార్ వరంగల్‌లో మూడు రోజులపాటు జరుగుతున్న ఇండియన్ ఓపెన్ అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు జాతీయస్థాయి సాంకేతిక అధికారిగా ఎంపికయ్యారు. ఇతను గతంలో పలు అంతర్జాతీయ పోలీస్, ఇతర అట్లాంటిక్ టోర్నీల్లో మెడల్స్ సాధించి గుర్తింపు పొందారు. బుధవారం ప్రారంభమైన టోర్నీ శుక్రవారం ముగియనుంది. టోర్నీలో వచ్చే సాంకేతిక ఫిర్యాదులపై ఆయన పరిశీలించి పరిష్కరించనున్నారు. అరుదైన గౌరవం దక్కిన అనిల్‌కుమార్‌ను శాంతి స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భువనగిరి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నూతన, మరమ్మత్తు పనుల కారణంగా శుక్రవారం జిల్లా కేంద్రం భువనగిరిలో నిర్దేశిత ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో టౌన్ ఏఈపీ సాయికృష్ణ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హౌసింగ్‌బోర్డు, సింగన్నగూడెం, టీచర్స్‌కాలనీ, తుక్కాపూర్‌రోడ్డు, నల్లగొండ బైపాస్‌రోడ్, శ్రీధకాలనీ, పవన్‌మోటార్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు.

కుర్రారంలో నేడు ఉచిత వైద్య శిబిరం

రాజాపేట,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలం కుర్రారం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సామాజిక వేత్త పాకాల క్రిస్టఫర్ గురువారం తెలిపారు. ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో బిట్టు డిజిటల్స్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హాజరవుతారని, రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

సీపీఆర్ పై అవగాహన పెంచుకోవాలి



బీబీనగర్: సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మౌనికారెడ్డి

మోత్కూరు/బీబీనగర్, , అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని మోత్కూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. గురువారం మోత్కూరు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి సీపీఆర్‌పై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఇటీవల గుండెపోటు జబ్బులు పెరిగిపోయాయని, గుండె పోటుతో బాధపడుతున్న వ్యక్తికి సీపీఆర్ చేసినట్టయితే కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. ఆ తర్వాత ఆస్పత్రికి తరలించి చికిత్స అందించవచ్చన్నారు. ఏ పరిస్థితుల్లో సీపీఆర్ ఎలా చేయాలన్నది ఆయన క్షుణ్ణంగా వివరించారు. పలువురు అధికారుల చేత డెమో చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.జ్యోతి, ఎంఈవో తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో డి.బాలాజీ, మునిసిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, ఎంపీవో పి.జనార్ధన్‌రెడ్డి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ కె.సతీష్ పాల్గొన్నారు. బీబీనగర్ మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు మండల వైద్యాధికారి డాక్టర్ మౌనికారెడ్డి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంఈవో సురేశ్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా రవీందర్‌రెడ్డి



రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న రవీందర్‌రెడ్డి

మోత్కూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీజె అబ్దుల్ కలామ్ లీడ్ ఇండియా ఫౌండేషన్, ట్రస్మా వారు మోత్కూరు సాయిచైతన్య ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ బి.రవీరందర్‌రెడ్డిని రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. బుధవారం రాత్రి హైద్రాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన అబ్దుల్ కలామ్ జయంతి, అవార్డు ప్రదాన కార్యక్రమంలో రవీందర్‌రెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి దిద్దిళ్ల శ్రీధర్‌బాబు, రిటైర్డు ఐపీఎస్ అధికారి భద్రీనాథ్, రిటైర్డు ఐఏఎస్ జగదీశ్వర్, జనార్ధన్‌రెడ్డి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాలకూర వెంకటేశ్వర్లు, శ్రీరాములు పాల్గొన్నారు.

భయాందోళన వద్దు..కుష్ఠుకు చికిత్స ఉంది



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రాజాపేట, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిపై భయాందోళన వద్దు అని, వ్యాధి లక్షణాలున్న వారు ఎం.డిటి ద్వారా చికిత్స పొందినట్లైతే వ్యాధి నయమవుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ మోసెస్‌రాజు అన్నారు. గురువారం రాజాపేట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జిల్లా లెప్రసి న్యూక్లియస్ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చికిత్స, వ్యాధి లక్షణాలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చందా రమేశ్,ప్రధానోపాధ్యాయులు తడుక రాజు, అనురాధ,డిప్యూటీ ప్యారా మెడికల్ ఆఫీసర్స్ రాములు, అనిత, మాధవి, రమేశ్, వైద్య సిబ్బంది విజయలక్ష్మి, ఉపేందర్, అనిత, జయశ్రీ, ఆశ పాల్గొన్నారు.

గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలి



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో, సూపర్వైజర్లు

ఆలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని, పుట్టబోయే శిశువు కూడా బలంగా ఉంటుందని ఐసీడీఎస్ ఆలేరు ప్రాజెక్టు సీడీపీవో రేఖల స్వరాజ్యం అన్నారు. గురువారం ఆలేరు పట్టణంలోని అంగన్వాడీ మూడో కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పుట్టిన ప్రతీ బిడ్డ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసి, పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా అయ్యే ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా సెంటర్ పరిధిలో ఉన్న గర్భిణులు నంద మమత, మద్దెల శిరీష, మాయ రజితకు శ్రీమంతం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉమారాణి, జ్యోతి, అంగన్వాడీ టీచర్లు, పద్మ, పుష్పలత, అనురాధ, శారదా, నవీన, ఝాన్సీరాణి, ఫాతిమా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి గర్భిణీలు, బాలింతలు హాజరైనారు.

భూములు లాక్కుంటే ప్రతిఘటన తప్పదు: సీపీఎం

భువనగిరి రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణలో స్పష్టత ఇవ్వకుండా బలవంతంగా భూములను లాక్కుంటే రైతుల నుంచి తీవ్రమైన ప్రతిఘటన తప్పదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య హెచ్చరించారు. గురువారం మండలంలోని ఎర్రంబెల్లిలో రీజనల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులతోకలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములు కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించి అలైన్ మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా బాధిత రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈనెల 17న సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న సామూహిక నిరసన దీక్ష, వంటావార్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు.

ట్యాంకుకు మరమ్మతులు చేయరూ..

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి): జనావాసాల నడుమ శిథిలావస్థకు చేరిన ట్యాంకు ఉండడంతో అది ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవతున్నారు. యాదగిరిగుట్ట మునిసిపాలిటి పరిధిలోని కొత్తగుండ్లపల్లి 8వ వార్డులో 30 సంవత్సరాల క్రితం దివంగత నాయకుడు, మాజీ ఎంపీ ధర్మభిక్షం నిధులతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ వాటర్ ట్యాంక్ పగుళ్ల పట్టి , లీకేజీలతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ట్యాంకు సమీపంలో నివాసగృహాలు ఉన్న ప్రజలు ప్రాణాలను అరచేతిపెటుకుని భయాందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు మునిసిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు తక్ష ణ ఎ ... స్వయంగా ... ట్యాంకును పరిశీలించి మరమ్మతులు చేపట్టి ప్రజలను ప్రమాదం నుంచి కాపాడాలని కోరుతున్నారు.



శిథిల దశలో ఉన్న ట్యాంకు



పెచ్చులూడుతున్న దృశ్యం

ప్రజల్లో భయాందోళన

ట్యాంకు నుంచి వాటర్ లీకేజీ అవుతూ పగుళ్లపట్టి పెచ్చులు ఊడిపోతూ పూర్తిగా శిథిలావస్థనకు చేరుకుంది. ఎప్పుడూ కూలుతుందోనని ఇంటినుంచి బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. పలుమార్లు మునిసిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ మరమ్మతులు చేయకుండ కాలయాపన చేస్తున్నారని, ట్యాంకు ప్రమాదవశాత్తున కూలితే ఎన్నో కుటుంబాలు మృత్యువాత పడటం ఖాయమని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పెచ్చులూడి కిందపడుతున్నాయి



ఇళ్ల మధ్య శిథిలావస్థతో ఉన్న ఓహెచ్‌ఆర్ వాటర్ ట్యాంకు ఎప్పుడు కూలుతోందని భయాందోళనగా ఉంది. వాటర్ ట్యాంకు పూర్తిగా శిథిలమై ట్యాంకు కిందిభాగం నుంచి పెచ్చులు ఊడిపోతూ ఉన్నాయి. ఇళ్ల మధ్య ఉన్న ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాం. వెంట నే మరమ్మతులు చేసి ప్రమాదం నుంచి కాపాడాలి.

-కంబాల పద్మ, కొత్తగుండ్లపల్లి

అమృత్ ట్యాంకులు నిర్మిస్తున్నాం



పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న అమృతపథకం ద్వారా ఓహెచ్‌ఆర్ వాటర్ ట్యాంకులు పూర్తికాగానే శిథిలావస్థకు చేరిన ట్యాంకును కూల్చివేస్తాం. కొత్తగుండ్లపల్లి గ్రామంలోని వాటర్ ట్యాం కు తాత్కాలికంగా గతంలో మరమ్మతులు చేశాం. మళ్లీ పరిశీలించి ప్రమాదం జరుగకుండా చర్యలు తీసుకుంటాం.

-మిర్యాల లింగస్వామి, మునిసిపాలిటీ కమిషనర్

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



పాడిచేడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి రైతులను కోరారు. గురువారం మండలంలోని చందుపట్ల, వీరవెల్లి, బండసోమారం తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళారులను ఆశ్రయించకుండా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం అందచేస్తున్న మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బల్గూరి మధుసూదన్ రెడ్డి, మహేందర్, స్వామి, బాలమ్మ, వెంకటేశ్వర్లు, శంకరయ్య, వెంకట్ రెడ్డి, లక్ష్మీ, సౌజన్య, సావిత్రమ్మ, మానిటరింగ్ అధికారి శోభ, సీఈవో నల్లమాస రాములు పాల్గొన్నారు.



ఆజీంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి

మోత్కూరు : మండలంలోని పొడిచేడు, అనాజిపురం, దత్తప్పగూడెం గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సంఘం సీఈవో కె.వరలక్ష్మీ, డైరెక్టర్ జిట్ట లక్ష్మయ్య, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, మానిటరింగ్ ఆఫీసర్ శ్యామ్‌కుమార్, సిబ్బంది నరహరి, యాకూబ్, సందీ ప్, కిషన్, సత్తయ్య, రైతులు సైదులు, వెంకయ్య, రాజేశ్వరి, నర్సయ్య, భాస్కర్‌రెడ్డి, హరి కృష్ణ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం అడ్డగూడూరు సింగిల్‌విండో ఆధ్వర్యంలో మండలంలోని కంచనపల్లి, ఆజీంపేట, వేల్దేవి, లక్ష్మీదేవికాల్వ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ చేడే చంద్రయ్య, డైరక్టర్లు పోగుల నర్సిరెడ్డి, ఎల్లంల వీరస్వామి, పండుగ నర్సయ్య, కడారి శ్రీశైలం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సైదులు, గంగయ్య, యాదగిరి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గ్రామస్థులు

భువనగిరి రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నివారణ కోసం ప్రతీ ఒక్కరు తమ వంతుగా చర్యలు తీసుకోవాలని స్కిడ్ ప్రాజెక్టు మేనేజర్ కొండమడుగు భానుకుమార్ అన్నారు. గురువారం మండలంలోని రెడ్డినాయక్ తండాలో స్కిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐఈసీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన జరిగింది. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచుతూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా పలు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంతోష పాల్గొన్నారు.

బంద్ విజయవంతానికి సమాయత్తం

భువనగిరి గంజ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే సంకల్పంతో ఈనెల 18న నిర్వహించనున్న బంద్‌కు బీసీ సంఘాలు, పలు రాజకీయ పార్టీలు సమాయత్తమవుతున్నాయి. సమావేశాలు నిర్వహిస్తూ కరపత్రాలను విడుదల చేస్తున్నారు. ఎన్నికల్లో బీసీలకు న్యాయమైన వాటా కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గురువారం జగ్జీవన్ భవనంలో వారు మాట్లాడారు. బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బండారు రవివర్ధన్, ఇటుకల దేవేందర్, లింగస్వామి, దాసరి మహేంద్ర, కిరణ్‌కుమార్ ఉన్నారు.

● బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదు అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గురువారం బీసీ సంఘం జాక్ ఆధ్వర్యంలో బీసీ బంద్ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో పోత్నాక్ ప్రమోద్ కుమార్, కొత్త నరసింహ, సుర్వి శ్రీనివాస్ గౌడ్, మాయ కృష్ణ, ఇమ్రాన్ అబ్దుల్, శోభన్ బాబు, దుబ్బ రామకృష్ణ, భానోత్ భాస్కర్ నాయక్, రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

గుండాల: బీసీ రిజర్వేషన్లకు సీపీఐ పార్టీ మద్దతు ప్రకటిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కుస్మాని హరిశ్చంద్ర, మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, నాయకులు దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలేరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు చెక్క వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆలేరు మండల తహసీల్దార్ అంజనేయులుకు ఆయన వినతిపత్రం అందజేశారు. పార్టీ పట్టణ కార్యదర్శి గొట్టిపాముల శ్రీనివాస్‌రాజు, సహాయ కార్యదర్శి అంజనేయులు, స్వామి, మాటూరి జానమ్మ పాల్గొన్నారు.

మోత్కూరు : బీసీ జేఏసీ నాయకులు స్థానిక వైజే ఫంక్షన్ హాల్లో సమావేశమయ్యారు. జనాభాలో తామెంతో రాజ్యాధికారంలో తమకు అంత వాటా కావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ జేఏసీ నాయకులు పోచం సోమయ్య, అవిశెట్టి అవిలిమల్లు, జంగ శ్రీనివాస్, సూదగాని యాదగిరి, కలిమెల నర్సయ్య పాల్గొన్నారు. కాగా బంద్‌కు బీజేపీ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు.

వలిగొండ : అక్టోబర్ 18న జరగబోయే బంద్ ఫర్ జస్టిస్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘం జిల్లా నాయకుడు సాయిని యాదగిరి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపార వాణిజ్య సంస్థలు, విద్యా సంస్థలు, ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.

రెండో'సారీ'

(3వ పేజీ తరువాయి)

టచ్‌లో ఉండేలా పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకోనుంది. ఇందుకోసం ఏఐసీసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే డీసీసీలే ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లకోసం సిఫారసు చేసే యోచన పార్టీలో ఉండటంతో, ప్రస్తుతం ఉన్న డీసీసీ అధ్యక్షుల స్థాయిలో సమీక్ష నిర్వహించనుంది. చాలాచోట్ల కూడా డీసీసీ అధ్యక్షులు నామమాత్రంగా అప్పటి ఎంపీలు, పలుకుబడి ఉన్న నేతల సిఫారసు మేరకు నియమించినట్లు అధిష్ఠానం భావిస్తుంది. ఇప్పటివరకు కొంతమంది డీసీసీలు అధిష్ఠానం సూచించిన కార్యక్రమాలు కూడా స్థానికంగా ఉన్న నేతలను సమన్వయం పరుచుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదో ఒక ఎంపీ, ఎమ్మెల్యే కనుసన్నల్లోనే డీసీసీ అధ్యక్షులు పనిచేస్తున్నారని, పార్టీని, నేతలందరినీ సమన్వయం పరుచుకోకపోగా, ఏకపక్షంగా పార్టీ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈనేపథ్యంలో జిల్లాల్లోని పార్టీ సీనియర్లకు డీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుందని భావిస్తుంది.

గ్రామస్థుల ఔదార్యం



ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు(ఎం) అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన రాచమల్ల మల్లయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. మల్లయ్య నాయిబ్రహ్మణ వృత్తి చేస్తూ గ్రామంలో ప్రజలకు అనేక సేవలు అందించాడు. అందరితో మమేకమై తలలో నాలుక లాగ కలిసి మెలిసి ఉండేవారని గ్రామస్థులు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. మల్లయ్య ది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు సమకూర్చిన రూ.68,500 ఆర్థిక సహాయాన్ని గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఫోన్లలో లింక్‌లు ఓపెన్ చేయొద్దు

మోటకొండూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గ్రూపుల్లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మోసపూరిత లింకులను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దని ఎస్ఐ డి.అశోక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయడం వల్ల ఫోన్‌లో ఉన్న వ్యక్తిగత సమాచారం హ్యాకర్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. అలాంటి లింకులను తక్షణమే ఫోన్‌లో నుంచి తొలగించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆయన వెంట కానిస్టేబుల్ ఆకుల వెంకటేష్, సంతోష్‌రెడ్డి ఉన్నారు.

నోటుబుక్స్, బ్యాగ్స్ అందజేత

వలిగొండ, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకారం, జాలుకాలువ, నెమలికాలువ, గొల్నేపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సుమారు రూ.3,40,000 విలువగల నోట్‌బుక్స్, బ్యాగులు దివిస్ లేబోలేటరీస్ లిమిటెడ్ వారి సౌజన్యంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నగేష్, నర్సిరెడ్డి, పావని, జ్యోతి, సుజాత, కృష్ణవేణి, లింగయ్య, దివిస్ ప్రతినిధులు సాయికృష్ణ, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మోత్కూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం గ్రామంలో సాదుల పెద్ద నర్సయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. గురువారం మాజీ సర్పంచ్ కడమంచి వస్తాద్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు.

నేటి విద్యార్థులే భావి సమాజ నిర్దేశకులు



సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

మోత్కూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే భావి సమాజ నిర్దేశకులని మోత్కూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళల అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పక్కవారికి చెడు జరుగుతుండటం చూసినప్పుడు దాన్ని నిలువరించే ప్రయత్నం చేయకపోవడం వల్ల కలిగే దుష్పరిణామాలు ప్రతీ ఒక్కరిని బాధిస్తాయన్నారు. సమాజం చెడిపోవడానికి తోడ్పడిన వారవుతారన్నారు. యువ త దురలవాట్లకు లోనై తప్పుదారి పట్టవద్దన్నారు. టీ సేఫ్ యాప్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ప్రభజస్టీస్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్ఐ కె.సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నర్సింహారెడ్డి, స్టూడెంటు కౌన్సిలర్ సిహెచ్.లింగస్వామి, సిహెచ్.అంజయ్య, ఎం.సతీస్, పి.విజయలక్ష్మీ, ఎం.సుజాత, వి.లావణ్య, బి.నర్సింహ పాల్గొన్నారు.

మత్స్యగిరి హుండీ రాబడి రూ.11.89లక్షలు

వలిగొండ, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మత్స్యగిరి గుట్టపైన గురువారం స్వామివారి హుండీ లెక్కించారు. 114 రోజులకు గాను రూ. 11,89,195లు, నిత్యాన్న ప్రసాదం రూ. 4,236లు ఆదాయం సమకూరినట్లు దేవస్థాన చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, దేవస్థానం ఈఓ మోహన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ భాస్కర్, ధర్మకర్తలు రవి, ఊషయ్య, రాములు, శ్రీను, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మునిపంపులలో 22నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం

రామన్నపేట, అక్టోబర్ 16, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిపంపుల గ్రామంలో దేవిరెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థం ఈనెల 22 నుంచి 28 వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ దేవిరెడ్డి సావిత్రమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని భగత్‌సింగ్ విజ్ఞానకేంద్రంలో ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైనవారికి ఈనెల 26 నుండి 30 వరకు ఆపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారంకోసం భగత్‌సింగ్ విజ్ఞానకేంద్రం నిర్వాహకులను సంప్రదించాలని కోరారు.

రైతు వేదికలకు నిధులేవీ?

(3వ పేజీ తరువాయి)

స్టేషనరీ, తాగు నీటి ఖర్చులన్నీ ఏఈవోలే తమ వేతనాలోంచి చెల్లిస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. సహాయకులు కూడా అందుబాటులో లేకపోవడంతో వారే అన్ని పనులు చక్కబెట్టుకుంటున్నారు. వీడియోకాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్షల నిర్వహణకు మండలానికో వేదిక ఏర్పాటు చేసినా, పరికరాల మరమ్మతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలు చోట్ల సీలింగ్ ఫ్యాన్ల రెక్కలు ఊడిపోవడం, కిటికీలు, టైల్స్ ధ్వంసం కావడం, ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి. దీంతో సరైన పర్యవేక్షణ లేక పలు వేదికలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయన్న ఆరోపణలున్నాయి.

జిల్లాలో ఇలా..
వ్యవసాయ క్లస్టర్లు : 92
మొత్తం రైతు వేదికలు : 92
సాగు విస్తీర్ణం : 4.50లక్షల ఎకరాలు
రైతులు : 2.84లక్షలు

ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది



జిల్లాలోని రైతు వేదికల్లో నెలకొన్న ఇబ్బందులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. వీటి నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది.

-రమణారెడ్డి, డీఏవో